సాక్షి కృష్ణాజిల్లా

ఆదివారం । 30 । జూన్ । 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్న దానానికి హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కూన పరెడ్డి నాగవెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



విత్తనాల షాపుల్లో తనిఖీలు

వత్సవాయి: తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు జి.కెనడీ వత్సవాయిలోని విత్త నాల షాపుల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, స్టాకును పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.00 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

కార్తికేయుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్ర హ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిం చే నిత్యాన్నదానానికి మచిలీపట్నానికి చెందిన భక్తుడు డాక్టర్ ఎల్.రాహుల్ రూ.1,00,116 విరాళం సమర్పించారు. ఆయన శనివారం ఉదయం స్వామిని దర్శించుకున్నారు. అనం తరం ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావుకు చెక్కు రూపంలో అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను ఆలయ అధికా రులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలి



పెనమలూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరాసుల్తానా సూచిం చారు. పెనమలూరు జెడ్పీ హైస్కూల్లో శని వారం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల ఉపాధ్యాయులకు అటల్ టింకరింగ్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో ఉపాధ్యాయులు సాంకేతికతపై అవగాహన కల్పించుకుని విద్యా ర్థులకు ఉత్తమ బోధన చేయాలని సూచిం చారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, డీఎస్‌ఓ జాకీర్‌అహ్మద్, స్టేట్ హబ్ ఇన్‌చార్జి డి.వి.సుబ్బా రావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని పాల్గొన్నారు. అటల్ టింకరింగ్ శిక్షణ శనివారం ముగిసింది.

లోక్ అదాలత్‌లో 1940 కేసులు పరిష్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ లోక్‌అదా లత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందొ చ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక అన్నారు. జిల్లాలో శనివారం వివిధ కోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌ల ద్వారా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించి పెండింగ్ కేసులు పరిష్కరించారు. మోటారు వాహన ప్రమాద కేసుల్లో మృతి చెం దిన కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెక్కు లను అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూ ర్తి మాట్లాడుతూ జిల్లాలో 40 లోక్ అదాలత్ బెం చ్‌లను ఏర్పాటు చేసి 1940 పెండింగ్ కేసులను పరిష్కరించామని తెలిపారు. 1,144 క్రిమినల్, 180 సివిల్, 364 చెక్‌బౌన్స్, 170 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించి, 82 మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లకు సంబంధించి బాధితులకు రూ 69.03 లక్షల నష్టపరిహారం అందజేశామ న్నారు. ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, న్యాయసేవాధికార సంస్థ కార్య దర్శి కె.వి.రామకృష్ణయ్య, న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ జయశ్రీ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రైతుల వర్రీ

- పంట కాలువలకు సాగు నీటి విడుదలపై ఖరారవని తేదీ
- నీరు ఎప్పుడు వస్తుందో తెలియక ఆందోళనలో అన్నదాత
- గత ఏడాది కంటే జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం
- ఇతర పంటలపైనా చూపనున్న ప్రభావం



బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామం వద్ద ఖాళీగా ఉన్న బంటుమిల్లి ప్రధాన కాలువ

సాక్షి, మచిలీపట్నం: ఖరీఫ్ సాగు ఆరంభంలోనే రైతులకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఎంతో ఆశతో సీజన్‌లో అడుపెట్టిన అన్నదాతలను సాగు నీరు సమస్యగా మారింది. ఖరీఫ్ సన్నాహక చర్యల్లో భాగంగా నెల క్రితం నుంచే పొలాలను దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేశారు. నైరుతి రుతు పవనాలు సకాలంలో వస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనలతో సంతోషించారు. అయితే రుతుపవ నాల ప్రభావం అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు సాగునీటి కాలువలపై ఆశలు పెట్టుకు న్నారు. ఏటా జూన్ 14వ తేదీ నుంచి జూలై మొదటి వారంలోగా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నెల ముగుస్తున్నా నీటి విడుదలపై ఎలాంటి స్పష్టత లేదు. పంట కాలువలకు సాగునీరు విడుదల చేసే తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఫలితంగా అన్నదాతల ఆశలు అడి యాశలుగా మారాయి. ముఖ్యంగా వరి సాగుచేసే రైతులను సాగునీటి సమస్య తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. నీటి విడుదల జాప్యం జరిగితే వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

గత ఏడాది 1.50లక్షల హెక్టార్లలో వరి సాగు

కృష్ణా జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పంట వరి. గత ఏడాది 1.50 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. 3.70 లక్షల ఎకరాల్లో వరిసాగు వేయగా సబ్సిడీ కింద రైతులకు 3,417.45 క్వింటాళ్ల వరి విత్త నాలను ప్రభుత్వం పంపిణీచేసింది. సగటున ఎక రాకు 32 బస్తాల నుంచి 38 వరకు ధాన్యం దిగుబడి వచ్చింది. మొత్తంగా 10.38 లక్షల టన్నుల ధాన్యం పండింది. ఈ ఖరీఫ్‌లో కృష్ణా జిల్లాలో ముందస్తు ప్రణాళిక తయారు చేసిన వ్యవసాయ శాఖ అధికా రులు ఈ సారి 1,65,789 హెక్టార్లలో వరి సాగ వుతుందని అంచనా వేశారు. రుతు పవనాలు సకా లంలో వస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో అన్నదాతలు వ్యవసాయ పనులను ప్రారంభించి, తమ పొలాలను సంసిద్ధం చేసు కున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా విలేజ్ అగ్రికల్చర్ సెక్రటరీలు రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

సాగు నీటిపై స్పష్టత కరువు

జిల్లాకు ప్రధాన నీటి వనరు కృష్ణా నది. ఇక్కడి నుంచే పంట కాలువల ద్వారా సాగుకు నీరం దించాలి. జిల్లాలో ప్రధానమైన బందరు కాలువ కింద 1.51లక్షల ఎకరాలు, కేఈబీ కింద 1.38 లక్షల ఎకరాలు, ఏలూరు కాలువ కింద 56 వేల ఎకరాలు, రైవస్ కింద 2.17 చొప్పున 5.62 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులోని ప్రధానంగా పెడన, గన్నవరం, గుడి వాడ, పెనమలూరు, పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాలకు సరఫరా చేయాల్సి ఉంది. వాస్తవానికి ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని జూన్ 14 తేదీ నుంచి జూలై మొదటి వారంలోగా కాలువలకు నీటిని విడు దల చేయాలి. అయితే వర్షాభావం, ఎగువ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ తగ్గిపోవడంతో నీటి విడుదలపై స్పష్టత లేకుండా పోయింది. అసలు ఎప్పుడు వదులుతారనే విషయంపై స్పష్టత కరువైంది.

6,691క్వింటాళ్ల విత్తనాలు

ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అంద జేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సారి 6,691 క్వింటాళ్ల విత్తనాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. క్వింటాకు రూ.500 చొప్పున సబ్సిడీ ద్వారా హెక్టా రుకు 25 కేజీల వరకు వరి విత్తనాలు ఇవ్వను న్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా రూ.33,45,500 భరించనుంది. ఇప్పటికే జిల్లా అధికారులు ప్రతిపా దనలు పంపించి, విత్తనాలు తెప్పించి ఇస్తున్నారు.

జాప్యం జరిగితే నష్టమే..

పంట కాలువలకు నీగు నీటి విడుదలలో జాప్యం జరిగితే వరిసాగు విస్తీర్ణం తగ్గనుంది. దీంతో పంట దిగుబడి కూడా ఆశించిన మేరకు రాదని వ్యవ సాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సాగు నీటిని ఎప్పుడు వదులుతారనే విషయంలో ఇప్ప టికీ స్పష్టత లేకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. వరితో పాటు ఇతర పంటలపైనా ఈ ప్రభావం పడనుంది.

స్త్రీ, శిశు సంక్షేమానికి కృషి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమానికి తోడ్పాటును అందించి వారి అభి వృద్ధికి కృషి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫ రెన్స్ హాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం, సమగ్ర శిశు సంర క్షణ పథకం, గృహహింస, చైల్డ్ హెల్ప్ లైన్-1098, వన్ స్టాప్ సెంటర్ – 181, చిల్డ్రన్ హోమ్, శిశు గృహ, స్వధార్ గృహ తదితర అంశాలపై శని వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బరువు తక్కువ ఉన్న పిల్లలు, వారి ఎదుగుదల, వారి సంరక్షణ, గర్భి ణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు ముందస్తు విద్య, ఆరోగ్య విద్య, టీకాలు, ఆరోగ్య పరీక్షలు, 18 సంవత్సరాల లోపు పిల్లల సంరక్షణ, పిల్లల దత్తత తదితర అంశాలను కలెక్టర్‌కు ఐసీడీ ఎస్ పీడీ సువర్ణ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది ఐసీడీ ఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 1,707 అంగన్వాడీ కేంద్రాల్లో ఆరేళ్ల లోపు పిల్లలు, గర్భిణులు, బాలిం తలకు షెడ్యూల్ ప్రకారం బాల సంజీవని పౌష్టికా హారాన్ని అందించి వారి సంక్షేమానికి తోడ్పాటు అందించాలని ఆదేశించారు. మచిలీపట్నం కోనేరు సెంటర్లో కొంతమంది యానాది పిల్లలు బోన్ ఫిక్స్ మత్తుకు గురవుతున్నారని, వారిని అందులో నుంచి బయటకు తీసుకురావడానికి తగిన చర్యలు తీసు కోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 72,866 మంది ఆరేళ్లలోపు పిల్లలు ఉండగా 1,106 మంది బరువు తక్కువగా ఉన్నట్లు నివేదికలు ఉన్నాయని వివరించారు. 1,106 మందికి కూడా సరైన పౌష్టికాహారం అందించి తక్కువ బరువు అధిగ మించాలని సూచించారు. 1,623 మంది పిల్లల్లో సరైన ఎదుగుదల లేదని వారికి, వారి తల్లిదం డ్రులకు సరైన అవగాహన కలిగించి మంచి పౌష్టి కాహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో సీడీపీవోలు సముద్రవేణి, విజయఫ్లోరెన్స్, సుకన్య, వెంకటలక్ష్మి, భానుశ్రీ, శేషు కుమారి, సుధారాణి, వన్ స్టాప్ సెంటర్ ఇన్‌చార్జ్ అతుష్మ, డీసీపీఓ మౌనిష, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన



చిలకలపూడి(మచిలీపట్నం): త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీతో కలిసి కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం పరిశీలించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన తాళాలు తెరచి ఈవీఎంలను తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, ఈవీఎంల నోడల్ అధికారి నిత్యానందం, ఇన్‌చార్జ్ ఆర్డీఓ శ్రీదేవి, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ టీడీపీ, జనసేన, సీపీఎం, బీఎస్పీ తదితర పార్టీల ప్రతినిధులు కొడాలి శర్మ, పి.వెంకట గజేంద్రరావు, ఎల్.వెంకటేశ్వరరావు, బి.వెంకన్నబాబు, బి.సుబ్రహ్మణ్యం, బాలాజీ పాల్గొన్నారు.

డయేరియాపై విస్తృత అవగాహన

- రేపటి నుంచి స్టాప్ డయేరియా కార్యక్రమం అమలు
- ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): డయే రియాను సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలకు విస్తృత అవగాహన కలిగిం చనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. అందులో భాగంగా జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తామని వివరించారు.

నిర్వహణ ఇలా..

- ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ మాత్రలు పంపిణీ.
- ఐదేళ్లలోపు పిల్లలున్న తల్లిదండ్రులకు డయే రియా సోకితే, ఓఆర్ఎస్ ఇవ్వడం, జింక్ మాత్రల ఆవశ్యకతపై అవగాహన కలిగించడం.
- చేతులు పరిశుభ్రతపై అవ గాహన కలిగించడం.
- సురక్షిత మంచినీటి వాడకం పై ఆవశ్యకతను వివరించడం.
- పిల్లలకు తల్లిపాల ఆవశ్య కత, అనుబంధ ఆహారం వంటి అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన
- విద్యాశాఖ సహకారంతో అన్ని పాఠశాలల్లో చేతులు పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కలిగించడం.
- ఆర్‌డబ్ల్యూస్ సహకారంతో గ్రామాల్లో మంచి నీటి సరఫరా ట్యాంకుల పరిశుభ్రత, పైప్‌లైన్‌లు లీకేజీలు, నీరు కలుషితమయ్యే ప్రదేశాలను గుర్తించి నివారించేందుకు చర్యలు చేపట్టడం
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సహ కారంతో పరిసరాలు పరిశుభ్రత నిర్వహణ.
- ఆయా కార్యక్రమాలను వైద్య ఆరోగ్యశాఖ, మహిళ శిశు సంక్షేమం, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సర ఫరా, మునిసిపల్ శాఖల సమన్వయంలో కార్యక్ర మాలు చేపట్టనున్నట్లు డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు.

పింఛన్ల పంపిణీ సజావుగా పూర్తి చేయాలి

కలెక్టర్ బాలాజీ



అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జూలై ఒకటో తేదీన లబ్ధి దారులు అందరికీ సజావుగా పింఛన్లు అందజేసేం దుకు అధికారులు సంసిద్ధం కావాలని కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశించారు. తన చాంబర్ నుంచి ఎంపీడీ ఓలు, మునిసిపల్ కమిషనర్లతో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. జిల్లాలో 2,42,321 మంది లబ్ధిదారులకు రూ.162.42 కోట్ల నగదు పంపిణీ చేయాల్సి ఉంద న్నారు. సచివాలయ సిబ్బంది పింఛను లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామ/వార్డు సచివాలయాల అధికా రులు నూరు శాతం నగదు డ్రా చేసుకుని జాగ్రత్తగా భద్రపరచుకోవాలని ఆదేశించారు. ఆదివారం సంబం ధిత సిబ్బందికి నగదు మొత్తాన్ని పంపిణీ చేయాల న్నారు. ముఖ్యమంత్రి లేఖ ప్రతులను డీఆర్డీఏ అధికా రులు ఆయా మండలాలు, మునిసిపాలిటీలకు 30వ తేదీలోగా పంపిణీ చేయాలన్నారు ప్రభుత్వం శని వారం విడుదల చేసిన కొత్త వర్షన్ మొబైల్ యాప్‌ను అందరూ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. విధుల్లో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగీ బయోమెట్రిక్ పరిక రాల పనితీరును పరిశీలించుకోవాలన్నారు. ఎంపీడీ ఓలు, మునిసిపల్ కార్యాలయాలతో పాటు జిల్లా కేం ద్రంలో కూడా ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పింఛను పంపిణీ ప్రక్రియను పర్యవే క్షించాలని పేర్కొన్నారు. తెల్లవారుజాము నాలుగు గం టలకు పింఛన్లు పంపిణీ చేసే అందరికీ వేకప్ కాల్స్ పంపాలని అధికారులకు సూచించారు. ఉదయం ఆరు గంటల నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయా లన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో డీపీఓ నాగేశ్వర్ నాయక్, పలువురు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

దొండపాడు వెల్నెస్ సెంటర్‌కు జాతీయ గుర్తింపు



అవార్డు అందుకుంటున్న రాష్ట్ర నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, సీహెచ్‌ఓ మౌనిక



తనిఖీలకు వచ్చిన కేంద్ర బృందంతో దొండపాడులోని వైద్య సిబ్బంది(ఫైల్)

- దేశంలోనే అత్యధికంగా 97.17శాతం స్కోర్‌తో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్
- గత ఏడాది నవంబరులోనే ఎన్‌క్యూఏఎస్ బృందం పరిశీలన

లబ్బీపేట(విజయవాడ తూర్పు): కృష్ణా జిల్లా దొండపాడు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ సెంటర్ దేశంలోనే అత్యధికంగా 97.17 శాతం స్కోర్‌తో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికేషన్ సాధించింది. ఈ మేరకు న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర అధికారుల నుంచి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికే ట్‌ను రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సుబ్ర హ్మణ్యం, దొండపాడు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ సీహెచ్‌వో మౌనిక అందు కున్నారు. కేంద్ర నాణ్యతా ప్రమాణాల బృందంలోని అధికారులు డాక్టర్ సునీల్ కుమార్ శర్మ, డాక్టర్ రియాజ్ అహ్మద్ గత ఏడాది నవంబరు 17న దొండపాడు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలిం చారు. ఈ సెంటర్‌కు విశాలమైన భవనం, ఆహ్లాదకరమైన పరిసరాలు, వస్తున్న రోగుల సంఖ్య, అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మందులు వంటి అంశాలను పరిశీలించారు. అన్ని రకాలుగా నాణ్యమైన సేవలు అందిస్తు న్నట్లు నిర్ధారించిన కేంద్ర బృందం దేశంలో అత్యుత్తమంగా 97.17 స్కోర్‌ను ఇచ్చింది. ఈ ఫలితాలను ఫిబ్రవరిలోనే ప్రకటించినా, తాజాగా సర్టిఫికేషన్‌ను అందజేశారు. గతంలో జిల్లాలోని వణు కూరు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కు కూడా ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ లభిం చింది. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు గత వైఎ స్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటుచేసింది. అవసర మైన ఉద్యోగులను కూడా నియమించి అన్ని వసతులను కల్పించి ప్రజలకు మెరు గైన వైద్యసేవలు అందేలా చూసింది. అందువల్లే దొండపాడు వెల్నెస్ సెంట ర్‌కు జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్కోర్‌తో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ లభించిందని వైద్య, ఆరోగ్య శాఖ అధికా రులు చెబుతున్నారు.

ప్రతి శనివారం ప్రజాదర్బార్

మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర శనివారం టీడీపీ నియోజక వర్గ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్య లను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి రవీంద్ర మాట్లా డుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రజాదర్బార్ నిర్వహిస్తా మన్నారు. ఆ రోజు ప్రజలు తనకు ప్రత్యక్షంగా సమస్యలను విన్నవించొచ్చని సూచించారు. మిగిలిన రోజుల్లో పార్టీ కార్యాలయంలో సమస్యలు తెలపొచ్చని పేర్కొన్నారు. ప్రారంభం రోజే 300 అర్జీలను స్వీకరించామని, ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని మంత్రి రవీంద్ర తెలిపారు. త్వరలో మచిలీపట్నం నగరంలోని ప్రతి డివిజ న్‌లో పర్యటిస్తానన్నారు. డ్రెయినేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సచివాలయ ఉద్యోగులతో జూన్ ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టామని వివరించారు. పిం ఛన్ మొత్తాన్ని రూ.4 వేలు చేశామని, ఏప్రిల్, మే, జూన్ నెలల అరియర్స్ కలిపి లబ్ధిదారులకు రూ.7 వేల చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా అర్హులందరికీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, ముని సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి.బాబాప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

11 కిలోల గంజాయి స్వాధీనం

రామవరప్పాడు: ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న సుమారు 11.270 కేజీల గంజాయిని పటమట పోలీసులు విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు వద్ద స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం షిమోగా ప్రాంతానికి చెందిన సయ్యద్ బాషా, సయ్యద్ వలీ అలీలు ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించడంతో ఎనికేపాడు వద్ద ఆపి ఇన్‌చార్జి సీఐ వాసిరెడ్డి శ్రీను, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. వీరి వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా సుమారు 11 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరు విశాఖపట్నం జిల్లా దారకొండ ప్రాంతం నుంచి గంజాయిను అక్రమంగా తీసుకువస్తున్నట్లు విచారణలో తెలిసింది. అక్రమంగా తరలిస్తున్న గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోల్డ్‌గోల్డ్ ఆభరణాల డిజైన్ల తయారీలో శిక్షణ

కోనేరుసెంటర్: మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీ పార్క్ మెంబర్స్ వెల్ఫేర్ సంఘం, ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యాన మచిలీపట్నం పోతేపల్లిలోని జువెలరీ పార్కులో రోల్డ్ గోల్డ్ ఆభరణాల తయారీపై (జువెలరీ క్యాడ్ డిజైన్) యువతీ యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సంఘ కార్యదర్శి జితేంద్ర కుమార్ శనివారం తెలిపారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9966489796, 9346695395 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

స్వచ్ఛ బందరుకు సహకరించాలి

పలు విభాగాల పనితీరుపై కలెక్టర్ బాలాజీ సమీక్ష



కోనేరుసెంటర్‌లో పండ్ల దుకాణదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నాన్ని స్వచ్ఛ, సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందితో ఆయన శనివారం కమిషనర్ చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, పన్నుల వసూళ్లు, సంస్థ ఆదాయ, వ్యయాలపై కలెక్టర్ సమీక్షించారు. నగరంలో డ్రెయిన్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని హెల్త్ అసిస్టెంట్లకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. కలెక్టర్ బంగళా ముందున్న డ్రెయిన్‌లో నీరుపారుదల జరగడం లేదని ఇక సామాన్యులు ఉండే ప్రాంతంలో డ్రెయిన్లు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చన్నారు. డ్రెయిన్లపై ఆక్రమణలు ఉన్నాయని సిల్ట్ తొలగింపునకు ఇబ్బంది కలుగుతోందని హెల్త్ అసిస్టెంట్ మహేష్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లికార్జునరావును ఆదేశించారు. అనంతరం కోనేరుసెంటర్‌లో ఉన్న డస్ట్‌బిన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ డస్ట్‌బిన్ తొలగించి ఈ ప్రాంతంలో పూలమొక్కలను ఉంచాలని సూచించారు. శనివారం రాత్రి నుంచి దుకాణదారుల నుంచి చెత్తను సేకరించే పద్ధతి అమలు చేయాలన్నారు. డంపర్‌బిన్ ఉన్న ప్రాంతంలో చెత్త వేయకుండా ఉండటానికి సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజును ఆదేశించారు. పశువుల యజమానులతో సమావేశం నిర్వహించి రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

స్వచ్ఛ, సుందర బందరుకు ప్రజలు సహకరించాలని కోనేరు సెంటర్‌లో కలెక్టర్ బాలాజీ మైక్‌లో కోరారు. నగరంలో పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరచడానికి డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్‌లు విడతల వారీగా నిర్వహిస్తామన్నారు. నగరాన్ని డస్ట్ బిన్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్ శ్రీకాంత్, డీఈలు సతీష్‌చంద్ర, వరప్రసాద్, సాంబశివరావు, ఎఈ వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారి ఎస్.వెంకటేష్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యనమలకుదురులో కత్తెరతో దాడి

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై కత్తెరతో దాడి చేసిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు పట్టురోడ్డుకు చెందిన పి.సాయికుమార్ తాపీ పనులు చేస్తాడు. అతనికి అదే వీధిలో ఉంటున్న షేక్ షాబుద్దీన్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాయికుమార్ నడుచుకుంటూ వెళ్తుండగా షాబుద్దీన్ వెనుక నుంచి వచ్చి కత్తెరతో దాడి చేశాడు. ఘటనలో సాయికుమార్ గాయపడ్డాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు
- మెగా జాబ్‌మేళాలో 70 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు



నియామకపత్రాలు అందించిన అధికారులు, కంపెనీల ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: జిల్లాలోని నిరుద్యోగులు జిల్లా ఉపాధి కల్పనాశాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను వినియోగించుకోవాలని ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు సూచించారు. స్థానిక పవిత్ర డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 409 మంది నిరుద్యోగులు హాజరుకాగా 16 కంపెనీలకు చెందిన ప్రతినిధులు 70 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో విక్టర్‌బాబు మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నిరుద్యోగికి చిన్న, పెద్ద ఉద్యోగం అనే తేడా లేకుండా చేస్తూ ఉంటే అవకాశాలు వస్తూ ఉంటాయన్నారు. పవిత్ర డిగ్రీ కళాశాల ఎండీ టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో తమ కళాశాల జాబ్‌మేళాల ఏర్పాటుకు సహకరిస్తోందన్నారు. ఉపాధి కల్పన శాఖకు తమ కళాశాల ఎప్పుడూ సహకరిస్తుందని జాబ్‌మేళాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ బొమ్మిడి అయ్యప్పస్వామి, ప్రిన్సిపాల్ అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్ జయరాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నియామక అధికారి తుర్లపాటి మధు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా జూద క్రీడలు

- తీరప్రాంతాలే కేంద్రం
- జూదమాడుతున్న బడాబాబులు, రాజకీయ పార్టీల నేతలు!
- శిబిరాలపై పోలీసుల మెరుపుదాడులు



పందెంరాయుళ్లను, స్వాధీనం చేసుకున్న కార్లను మీడియాకు చూపుతున్న పోలీసులు

కోడూరు: జూద క్రీడలు మళ్లీ తెర మీదకు వచ్చాయి. పేకాట, కోడిపందేల శిబిరాలు జోరందుకున్నాయి. కోడూరు మండలంలోని తీరప్రాంత గ్రామాలను కేంద్రాలుగా చేసుకొని పందెంరాయుళ్లు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి జూదక్రీడలు నిర్వహిస్తున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన బడాబాబులు, రాజకీయ పార్టీల నేతలు కూడా జూదంలో పాల్గొంటున్నట్లు సమాచారం.

పోలీసుల మెరుపు దాడులు

శనివారం మధ్యాహ్నం రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని బసవానిపాలెం (సముద్రతీరానికి అతి సమీపంలో) వద్ద కోడిపందేలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు దాడులు జరిపారు. 14 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రెండు కార్లు, రూ.12 వేల నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారు బాపట్ల, బంటుమిల్లి, పాలకాయతిప్ప ప్రాంతాలకు చెందినవారని ఎస్‌ఐ తెలిపారు.

బడాబాబులను పక్కకు తప్పించిన పోలీసులు?

దాడుల సమయంలో ఆ ప్రాంతంలో చాలా మంది ఉన్నట్లు సమాచారం. అమాయకులైన ఇతర ప్రాంతాలకు చెందిన 14 మందిని అదుపులోకి తీసుకొని బడాబాబులను పోలీసులు పక్కకు తప్పించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దాడుల సమయంలో భారీ మొత్తంలో ద్విచక్రవాహనాలు, కార్లు ఉండగా కేవలం రెండింటిని మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. దాడుల్లో కనీసం ఒక్క సెల్‌ఫోన్‌ను పట్టుకున్నట్లు చూపించకపోవడం కూడా అనుమానాలను నిజం చేస్తోంది. రూ.లక్షల్లోనే నగదును కూడా పోలీసులు స్వాధీనం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విశ్వవిద్యాలయం అభివృద్ధికి అలుపెరుగని కృషి

కేయూ ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి



కోనేరుసెంటర్: ఉపకులపతిగా తాను పదవీ బాధ్యతలు తీసుకున్న నాటినుంచి కృష్ణా విశ్వవిద్యాలయం అభివృద్ధికి అలుపెరగకుండా పని చేశానని ఆచార్య జ్ఞానమణి తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయ సెనేట్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదకొండున్నర నెలల పదవీ కాలంలో ప్రధాన గేట్ (ఆర్చ్) నిర్మాణం, విశ్వవిద్యాలయ ప్రహరీ (కాంపౌండ్ వాల్) నిర్మాణం, సర్వహంగులతో ఆహారశాల (క్యాంటిన్), సకల సౌకర్యాలతో ఫార్మసీ కళాశాల నిర్మాణం చేపట్టామని చెప్పారు. బాలికల వసతి గృహం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని క్రీడాప్రాంగణం నిర్మాణానికి కేంద్ర క్రీడలశాఖకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ప్రముఖ సంస్థల ద్వారా ప్రాంగణ ఎంపికలు నిర్వహించి 250 మందికి ఉద్యోగాలు ఇప్పించామని గుర్తుచేశారు. సిలికాన్ ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఎంఓయూ చేసుకుని ఐదుగురు విద్యార్థులను ఉన్నత చదువుల నిమిత్తం అమెరికాకు పంపడానికి చర్యలు తీసుకోవడం గర్వంగా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం ద్వారా సేవా కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. విశ్వవిద్యాలయ సిబ్బంది సహాయసహకారాలతో ఇన్ని కార్యక్రమాలు అమలు చేశామని వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమాల తీరును చూపించారు. నిబంధనలకు అనుగుణంగా కమిటీలు ఏర్పాటు చేసి అవినీతికి తావులేకుండా వాటి పర్యవేక్షణలో కార్యక్రమాలు చేశామన్నారు. విశ్వవిద్యాలయంలో రాజకీయ పార్టీలకు, సిఫార్సులకు అవకాశం ఇవ్వకుండా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు, ఫైనాన్స్ ఆఫీసర్ రతన్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్.ఉష, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, నూజివీడు పీజీ స్టడీస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన లావణ్య లత, పలు విభాగాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

నవజాత శిశువు స్క్రీనింగ్‌పై అవగాహన పెంచుకోవాలి



శిక్షణలో పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బందితో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీనాయుడు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నవజాత శిశువుల స్క్రీనింగ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వాస్పత్రి పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పి. అనీల్‌కుమార్ అన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో నవజాత శిశువు స్క్రీనింగ్ విధానంపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆధ్వర్యంలో, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.మాధవినాయుడు పర్యవేక్షణలో జరిగిన శిక్షణలో పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏరియా ఆస్పత్రిలు, బోధనాస్పత్రిలు, మాతా శిశు సంరక్షణ కేంద్రాల వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు మొత్తం 264 మంది పాల్గొన్నారు. వారికి డాక్టర్ అనీల్‌కుమార్ తదితరులు నవజాత శిశువులను స్క్రీనింగ్ ఎలా చేయాలి, లోపాలు ఉంటే ఏ విధంగా గుర్తించాలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ వైద్యుడు జాలాది రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి సెమినార్



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి సెమినార్ శనివారం ముగిసింది. మ్యాథమెటికల్ మెథడ్స్ మోడల్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ అండ్ ఆక్వాకల్చర్ ఫ్రం జీనియస్ టు ఎకోసిస్టమ్ అంశంపై నిర్వహించిన సెమినార్‌లో హైదరాబాద్ నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్ వక్తగా పాల్గొని జెనిటిక్స్‌లో మ్యాథమెటిక్స్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు అప్‌డేట్ అవ్వాలని సూచించారు. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ జేడీ భవన్‌కుమార్ మానవ జీవితంలో స్టాటిస్టిక్స్ పాత్ర సంబంధాన్ని వివరించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.నాగేశ్వరరావు, సైంటిస్ట్ డాక్టర్ రమేష్ రాథోడ్ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం సెమినార్‌లో ఓరల్, పేపర్ ప్రజెంటేషన్ కార్యక్రమం జరిగింది. అత్యుత్తమ ప్రజెంటేషన్ చేసిన వారికి నగదు బహుమతులు, సెమినార్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పి.శైలజ, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సుధాకర్, ఎం.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.